నల్లజేరు చెరువు తూములోని చెత్త తొలగింపు

బీర్కూర్ నల్లజేరు చెరువు తూములోని చెత్తను తీయిస్తున్న అధికారులు, బీఆర్ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, మార్చి 12 : మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం బీర్కూర్ నల్లజేరు చెరువు తూములోని చెత్తను నిపుణులతో తొలగింపజేశారు. చెరువు తూములోని చెత్తను తొలగించడంతో చెరువు ఆయకట్టు కింద ఉన్న 650 ఎకరాలకు పుష్కలంగా సాగు నీరు అందనున్నది. చెత్తను తొలగించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సభ్యుడు సందీప్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఆరిఫ్, నాయకులు ఆవారి గంగారాం, కొరిమె రఘు, అధికారులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

మాచారెడ్డి, మార్చి 12 : మండల కేంద్రంలో రూ.లక్ష నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు ఎంపీటీసీ రావుల వినోద ప్రభాకర్ తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడిగిన వెంటనే ఎంపీ నిధులు మంజూరు చేసిన బీబీ పాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బస్వాపూర్ విండోచైర్మన్‌పై అవిశ్వాసం

డీసీవోకు తీర్మాన కాపీ అందజేసిన డైరెక్టర్లు

భిక్కనూరు, మార్చి 12: మండలంలోని బస్వాపూర్ సింగిల్ విండో చైర్మన్ కిష్టాగౌడ్‌పై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ మేరకు తీర్మాన కాపీని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్‌కు నిజామాబాద్‌లో మంగళవారం అందజేశారు. తీర్మాన కాపీని అందజేసినవారిలో మొత్తం 13 మంది డైరెక్టర్లకు 12 మంది ఉన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

రాజంపేట్, మార్చి 12 : మండలంలోని ఆర్గొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్రరావు, పీఈటీ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జగన్నాథ శర్మ, వెంకట్, బాల్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్, సరస్వతి, జ్యోతి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బాల్‌నర్సింహులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

■ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, మార్చి 12 : ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఏ క్షణంలోనైనా ఏ పాఠశాలనైనా తనిఖీ చేస్తానని, ఎక్కడ తప్పు కనిపించినా సహించేది లేదని, పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో రాజు, పరీక్షల విభాగం అధికారి నీలం లింగం, ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమం మంచి ఆలోచన

వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమం మంచి ఆలోచన అని, ఈ కార్యక్రమంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. భారతీయ రైల్వే ఆధునీకరణ కార్యక్రమంలో భాగంగా వన్ రైల్వే స్టేషన్ - వన్ ప్రొడక్ట్ 85 వేల కోట్లకుపైగా విలువైన రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన సందర్భంగా మంగళవారం కామారెడ్డిలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో ఎయిర్ పోర్టులతో సమానంగా రైల్వే వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని అన్నారు. వందే భారత్ వంటి రైలుతో ప్రయాణం తొందరగా పూర్తవుతుందని తెలిపారు. ప్రపంచంలోనే మొదటి స్థానంలో భారత రైల్వే వ్యవస్థ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

బీబీపేట్‌లో ఆరోగ్య శిబిరం

బీబీపేట్, మార్చి 12: మండల కేంద్రంలోని హైదరాబాద్ విహారి ఆధ్వర్యం లో బీబీపేట వాసవి క్లబ్ సహకారంతో మంగళవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆక్యుపంక్చర్, న్యాచురోపతి ఉచిత కన్సల్టేషన్, వైద్యం, మధుమేహం, బీపీ తదితర అన్ని రకాల వ్యాధులకు విహారి అధినేత పెద్దవీణ, హరిధర్, రేవతి, జయదీప్ సాయి ఆధ్వర్యంలో 182 మందికి పరీక్షలు చేశారు. అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి కిరణ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు యాదగిరి, చంద్రశేఖర్, విశ్వప్రసాద్, బాశెట్టి నాగేశ్వర్, పెద్ది నాగేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి మహిళ లే వెన్నెముక

■ జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి

టీ విక్రయించే మహిళను సన్మానించిన జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి

కామారెడ్డి, మార్చి 12 : కుటుంబం, సమాజంతోపాటు దేశాభివృద్ధికి మహిళలు వెన్నెముకలాంటి వారని జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా కోర్టు ఆవరణలో 20 ఏండ్లుగా టీ దుకాణం నిర్వహిస్తూ నలుగురి సంతానాన్ని పెంచి పోషించిన శారదను జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి శాలువాతో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పురుషులతో సమానంగా మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. టీ విక్రయించే మహిళ తన స్వశక్తితో కుటుంబ బాధ్యతలను మోస్తూ ముందుకు సాగుతున్న ఆమెను న్యాయమూర్తి అభినందించారు. ఆమెకు మరింత ధైర్యాన్ని ఇచ్చి బహుమతి అందజేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉన్నత ఆలోచనలు, ఆరోగ్యవంతమైన సమాజం మహిళల ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయసేవా అధికార సంస్థ సూపరింటెండెంట్ పంచ చంద్రారెడ్డి, ఖాన్, శ్రావణ్, పోలీసు లైసెన్ అధికారులు విఠల్, హన్మాండ్లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

■ ఎస్పీ సింధూశర్మ

మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, మార్చి 12 : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎస్పీ సింధూశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో డిస్ట్రిక్ట్ పోలీసు అన్యువల్ స్పోర్ట్స్ మీట్-2024 క్రీడలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖాకీ యూనిఫాంతో ఏదో పని ఒత్తిడిలో ఉన్న నేటి రోజుల్లో కొద్దిగా ఉపశమనం, ఉల్లాసం కోసం ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించి ముందుకు సాగాలన్నారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, టగ్ ఆఫ్ వార్, షాట్‌పుట్, షటిల్, బ్యాడ్మింటన్, 100, 200 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ట్రైనింగ్ ఐపీఎస్ కాజోల్ సింగ్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సత్యనారాయణ, ఎస్సీ ఇన్‌స్పెక్టర్ జార్జ్, సీఐలు, ఎస్సైలు, డీపీవో, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి'

మాచారెడ్డి, మార్చి 12 : బీడీ కంపెనీల్లో పనిచేసే కార్మికులకు ఏప్రిల్ నుంచి పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి శివంది సత్యం అన్నారు. మంగళవారం అక్కాపూర్ గ్రామంలో బీడీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీడీ పరిశ్రమపై ఏడు లక్షల మంది కార్మికులు ఆధారపడి పని చేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.

దేశాయిపేట్‌లో కొనసాగుతున్న సప్తాహం

సప్తాహంలో పాల్గొన్న ఏనుగు రవీందర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్, మార్చి 12 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామ హనుమాన్ ఆలయంలో సప్తాహం కొనసాగుతున్నది. మంగళవారం నిర్వహించిన హరినామ సప్తాహంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సతీమణి మంజులతో కలిసి పాల్గొన్నారు. భక్తులు, నాయకులతో కలిసి కీర్తనలు ఆలపించారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్, కొత్తకొండ భాస్కర్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, పాత బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

బోర్లం గ్రామంలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

బాన్సువాడ రూరల్, మార్చి 12 : బకాయిలు చెల్లించి గ్రామాభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని ఎంపీడీవో బషీరుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని బోర్లం గ్రామం లో పన్నుల వసూలుకు చేపడుతున్న ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇంటి పన్ను వసూలు చేస్తూ రసీదులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్లం, తాడ్కోల్ గ్రామాల్లో పన్ను వసూలు చేస్తున్నామని తెలిపారు. మండలంలో వందశాతం పన్నుల వసూలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సాయికుమార్, శ్రీధర్‌రెడ్డి, పండరి, ప్రశాంతి, రహీలాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను వసూలు..

నస్రుల్లాబాద్, మార్చి 12 : మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో మంగళవారం ఇంటి పన్ను వసూలులో ఎంపీవో రాము పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి మఖీద్ ఉన్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

విద్యార్థులకు పెన్నులను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నిజాంసాగర్, మార్చి12: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు రవికాంత్, రత్నకాంత్ వారి మాతృమూర్తి అన్నమ్మ గారి జ్ఞాపకార్థం పరీక్షా ప్యాడ్లు, పెన్నులను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీబీపేట్‌లో..

బీబీపేట్, మార్చి 12 : బీబీపేట్‌లోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 31 మంది విద్యార్థినులకు బీబీపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి శ్రీగాధ శంకర్ పరీక్ష ప్యాడ్లు, సామగ్రిని మంగళవారం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని అందజేస్తున్న గిరిజన నాయకులు

ఎల్లారెడ్డి, మార్చి 12: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరయ్యారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేకంగా నిర్వహించిన భోగ్ భండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గిరిజనులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మార్గంలో నడుస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలన్నారు. గిరిజనులను ఏకం చేసేందుకు సేవాలాల్ చేసిన కృషి అనితర సాధ్యమన్నారు. తండాల్లో సీసీ రోడ్లు, విద్యుత్, తాగునీరు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎల్లారెడ్డి గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 9.90 లక్షలు మంజూరుచేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఆలిండియా బంజారా జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పవార్ యశ్వంత్‌రావ్, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీపీలు, వివిధ మండలాల బంజారా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి

పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే షిండే

బిచ్కుంద, మార్చి 12: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మహదేవ స్వామి కొలనుపాక రేణుకాచార్య పాదయాత్ర మంగళవారం మండల కేంద్రానికి చేరుకున్నది. ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావంతో కొనసాగాలని, అప్పుడే మానవ జన్మ చరితార్థం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు, నాయకులు బస్వరాజుపటేల్, డాక్టర్ రాజు, నారం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పట్టణంలోని 12వ వార్డులో ఉన్న గూడెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

-ఎల్లారెడ్డి రూరల్, మార్చి 12

'విశ్వకర్మ' దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలి

పిట్లం, మార్చి 12: విశ్వకర్మ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీవో కమలాకర్ అన్నారు. మంగళవారం ఆయన మండలపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాతెల్లిలో తొలగిన నీటి ఇబ్బందులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 12: మండలంలోని సాతెల్లి గ్రామంలో ఏండ్ల తరబడి వేధిస్తున్న నీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో నెలకొన్న నీటి ఇబ్బందులను స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా..నూతనంగా బోరుబావిని మంజూరుచేశారు. దీంతో గ్రామంలో బోరువేయగా.. అధికారులు మంగళవారం మోటర్‌ను బిగించారు. దీంతో గ్రామంలో నీటి సమస్య తొలగడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

పెద్ద కొడప్‌గల్, మార్చి 12: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని హరి భక్త పారాయణ్ దేగుల్‌వాడి వెంకట్ రావు దేశాయ్ మహరాజ్ అన్నారు. మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఏడు రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం మంగళవారం ముగిసింది. విఠలేశ్వర రుక్మిణి దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిభక్త పారాయణ్ దేగుల్‌వాడి వెంకట్ రావు దేశాయ్ మహరాజ్ మాట్లాడుతూ... దైవ నామస్మరణ చేస్తే భగవంతుడికి ప్రీతి పాత్రులవుతారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మర్కల్ స్టేజీ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే స్థలాన్ని పరిశీలిస్తున్న ఐపీఎస్ అధికారిణి కాజల్

సదాశివనగర్, మార్చి 12 : జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని ఐపీఎస్ అధికారిణి కాజల్ అన్నారు. మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ఆమె మంగళవారం పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సదాశివనగర్ సీఐ సంతోష్‌గౌడ్, ఎస్సై రాజులకు పలు సూచనలు చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే స్థానిక పోలీసులు లేదా 100, 108 నంబర్లకు ఫోన్‌చేసి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా శిశు సంక్షేమ శాఖాధికారిణి స్వర్ణలత

విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న జిల్లా శిశు సంక్షేమ శాఖాధికారిణి స్వర్ణలత

సదాశివనగర్, మార్చి 12 : పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా శిశు సంక్షేమ శాఖాధికారిణి స్వర్ణలత అన్నారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో గ్లోబల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరీక్ష ప్యాడ్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులకు ప్యాడ్లను పంపి ణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు భయం వీడి పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కావద్దని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింహారావు, మాజీ ఉప సర్పంచ్ చింతల లక్ష్మీనారాయణ, రామారెడ్డి సీఆర్పీ మహమూద్, గ్లోబల్ యూత్ ప్రతినిధులు షకీల్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు జంగం మహేందర్, నగేశ్, వెంకటేశం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం:** మద్నూర్, మార్చి12: మండలకేంద్రంలోని మార్కెట్ యార్డు సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పటేల్ మంగళవారం తెలిపారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.
- **నర్సింగ్‌రావు పల్లిలో 'గృహజ్యోతి' ప్రారంభం:** నిజాంసాగర్, మార్చి 12: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామంలో మంగళవారం గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా ఆరు గ్యారెంటీలను ముందుగా అమలు చేస్తున్నామని నాయకులు అజయ్, రమేశ్ అన్నారు.
- **జోరుగా పన్నుల వసూలు:** పిట్లం, మార్చి 12: మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా జగదాంబతండా పంచాయతీ పరిధిలో కార్యదర్శి వినోద్, సిబ్బందితో కలిసి మంగళవారం ఇంటింటికీ తిరిగి పన్నులు వసూలు చేశారు.
- **కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీధర్‌గౌడ్:** ఎల్లారెడ్డి, మార్చి 12: కాంగ్రెస్ పార్టీ నాగిరెడ్డిపేట్ మండల అధ్యక్షుడిగా శ్రీధర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు మంగళవారం సన్మానించారు.
- **కన్నాపూర్‌లో డీఎల్పీవో పర్యటన:** రామారెడ్డి, మార్చి12: మండలంలోని కన్నాపూర్ గ్రామంలోడీఎల్‌పీవో పీవీ శ్రీనివాస్ మంగళవారం పర్యటించారు. గ్రామంలోని నర్సరీ, కంపోస్ట్‌షెడ్డు, పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి లావణ్యకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వేసవికాలంలో మొక్కలు ఎండిపోకుండా తరచూ నీరందించాలని సూచించారు. డీఎల్పీవో వెంట ఎంపీడీవో సవితారెడ్డి తదితరులు ఉన్నారు.
- **మొక్కలను సంరక్షించాలి:** పిట్లం, మార్చి 12: మండలంలోని కుర్తి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నర్సరీని పంచాయతీ కార్యదర్శి క్రిష్ణయ్య మంగళవారం సందర్శించారు. ఉపాధి హామీ కూలీలతో మొక్కలకు నీళ్లు పట్టించారు. నర్సరీలోని ప్రతి మొక్కనూ సంరక్షించాలని నిర్వాహకులకు సూచించారు. వేసవికాలం దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా రెండుసార్లు నీటిని పట్టాలని ఆదేశించారు.
- **కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు:** ఎల్లారెడ్డి రూరల్, మార్చి 12: ఎల్లారెడ్డిలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్ కేంద్రాల్లో మంగళవారం ద్వితీయ సంవత్సర ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షల సీఎస్ హేమచందర్ మాట్లాడుతూ.. ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 239 మంది విద్యార్థులకు 233 మంది హాజరైనట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★అక్వా అక్షర పవన్ ఎంటర్‌ప్రైజెస్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. Age 18-45 Years, సాలరీ మార్కెటింగ్ స్కిల్స్ బట్టి 10K- 40K వరకు ఉంటుంది. Only 6 hours time ✆ 9121825513
NTZ-324729

CHANGE OF NAME

★I, AKULA MARUTHI NANDAN GOUD R/o. H.No.4-51/4, Ramadugu, Dharpally, Nizamabad. T.S. Change my new name as JAKRANPALLY MARUTHI NANDAN GOUD S/o. JAKRANPALLY CHANDRA GOUD
NTZ-324733

PASSPORT LOST

★I, SINDOLLA GOPI S/O. SINDOLLA VITTAL R/o.H.No.2-20, Veerapur Vill, Birkur Mdl: Dist. Kamareddy, My Passport No.L7454601 was lost, while I was Driving on a Tractor at Morthad any one found pls Call:7659994341
NTZ-318832

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే. ఫోటో అదనపు లైనుకు 100/- మాత్రమే. "పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- ఫోటో అదనపు లైనుకు 500/- మాత్రమే. GST వర్తించును